

నైనీ బ్లాకులో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలి 6లో..

వర్షాలతో ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూడాలి 6లో..

రుణమాఫీకి వేళాయె..



- నేడు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించనున్న సీఎం
- జిల్లాలో 29,274 మంది ఖాతాల్లో రూ.లక్ష వరకు జమ
- రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు ఏర్పాటు
- రైతులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గడిచిన ఐదేళ్లలో వివిధ బ్యాంకుల్లో పొందిన పంట రుణాల మాఫీకి వేళయ్యింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు రెండు లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ డబ్బులను ఆగస్టు 15లోగా అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆ డబ్బులను ఈనెల 18వ తేదీ నుంచే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండడంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొలి రోజు లక్ష రూపాయల వరకు రుణాలు గల రైతులందరి ఖాతాల్లో రుణ మాఫీ సొమ్మును జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది. అందులో భాగంగా జిల్లాలో లక్ష రూపాయల వరకు 29,274 మంది రైతుల ఖాతాల్లో గురువారం సాయంత్రం కల్లా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. ఆ మేరకు జిల్లాలో రైతువేదికల్లో రైతులతో కలిసి సంబరాలు నిర్వహించేందుకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మండలానికి ఒక రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను బిగిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లా కేంద్రంతో పాటు ఆర్డీవో కార్యాలయాల్లోనే ఉన్న వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను ప్రతి మండలానికి ఒకటి ఏర్పాటుచేయనున్నారు. ఇప్పటికే ఆ పరికరాలు జిల్లాకు చేరుకోగా, మొదట వాటిని రైతు వేదికల్లో ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 3 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రుణ మాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు డీబీటీ బటన్ నొక్కి ప్రారంభించనున్నారు. అనంతరం రైతులను ఉద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. ఆయా జిల్లాల రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నారు.

జిల్లాలోని పెద్దపల్లి మండలం రాఘవాపూర్ రైతువేదిక, సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి, ఎలిగేడు మండలం ఎలిగేడు, జూలపల్లి మండలం తేలుకుంట, ఓదెల మండలం ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలం కాల్వశ్రీరాంపూర్, మంథని మండలం గుంజపడుగు, రామగిరి మండలం కల్వచర్ల, ముత్తారం మండలం ముత్తారం, కమాన్‌పూర్ మండలం గుండారం, రామగుండం మండలం మేడిపల్లి, పాలకుర్తి మండలం ఎల్కలపల్లి, అంతర్గాం మండలం అంతర్గాం రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను బిగించారు. ఇక్కడ పెద్దఎత్తున రైతులను సమావేశ పరచనున్నారు. గురువారం సాయంత్రం కల్లా లక్ష రూపాయల వరకు బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. రుణమాఫీ సంబరాల్లో జిల్లాకు చెందిన ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హైదరాబాద్‌లో జరగనున్న కార్యక్రమంలో, పెద్దపల్లి నియోజకవర్గంలో చింతకుంట విజయరమణారావు, రామగుండం నియోజకవర్గంలో రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ పాల్గొననున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు మండలాల్లో రైతులతో కలిసి సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

● 29,724 మంది గుర్తింపు..

లక్ష రూపాయల వరకు జిల్లాలో 29,724 రైతులు ఉన్నట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. రామగుండం నియోజకవర్గంలోని అంతర్గాం మండలంలో 1,077 మంది, పాలకుర్తి మండలంలో 1,260 మంది, రామగుండం మండలంలో 213 మంది రైతుల ఖాతాలో జమ చేయనున్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఎలిగేడు మండలంలో 1,421 మంది, జూలపల్లి మండలంలో 2,337 మంది, ఓదెల మండలంలో 2,742 మంది, పెద్దపల్లి మండలంలో 3,779 మంది, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 2,789 మంది, సుల్తానాబాద్ మండలంలో 3,547 మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నారు. మంథని నియోజకవర్గంలోని కమాన్‌పూర్ మండలంలో 1,170 మంది, మంథని మండలంలో 2,863 మంది, ముత్తారం మండలంలో 1,616 మంది, రామగిరి మండలంలో 1,071 మంది, ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారం మండలంలో 3,839 మంది రైతుల ఖాతాల్లో లక్ష రూపాయల వరకు గల రుణ మాఫీ సొమ్మును జమ చేయనున్నారు.



ఎలిగేడు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఆదిరెడ్డి

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం..

- దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి



రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం. ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏకకాలంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా లక్ష వరకు రైతుల ఖాతాల్లో రుణ మాఫీ సొమ్ము జమ కానున్నది. దేశ చరిత్రలోనే 2 లక్షల రూపాయల వరకు రైతులకు రుణ మాఫీ చేసిన ఘనత ఏ ప్రభుత్వానికి దక్కలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష వరకు రుణ మాఫీ చేసేందుకు అపసోపాలు పడింది. రెండోసారి ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదు. సగం మంది రైతులకు కూడా రుణ మాఫీ చేయలేదు. ఆగస్టు 15లోగా అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ చేసి తీరుతాం. రైతుల కళ్లల్లో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యం.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ప్రభుత్వం..

- చింతకుంట విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే



రైతులకు ఏకకాలంలో రుణ మాఫీ చేయడం శుభపరిణామం. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని మా ప్రభుత్వం నెరవేర్చేందుకు రంగం సిద్ధం చేసింది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయనటువంటి రుణ మాఫీ పథకాన్ని ఏకకాలంలో అమలుచేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతున్నది. రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నది. మాట తప్పని ప్రభుత్వం ఇది. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది. గురువారం లక్ష వరకు రుణాలు గల రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

ఒకేసారి రుణ మాఫీ చేస్తున్న చరిత్ర కాంగ్రెస్‌కే దక్కుతుంది..


- రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్, రామగుండం ఎమ్మెల్యే



రైతులకు ఒకేసారి రుణమాఫీ చేస్తున్న చరిత్ర కాంగ్రెస్ పార్టీకే దక్కుతుంది. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు మా ప్రభుత్వం గురువారం నుంచి లక్ష రూపాయల వరకు రైతుల ఖాతాల్లో రుణ మాఫీ సొమ్మును జమ చేయనున్నది. కాస్త ఆలస్యమైనా రుణ మాఫీ చేస్తారనే నమ్మకాన్ని రైతులు ప్రభుత్వంపై పెట్టుకున్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది. ఎన్నికల సందర్భంగా సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో భాగంగా రుణ మాఫీ పథకాన్ని అమల్లోకి తీసుకవస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్నాను. రుణ మాఫీపై రైతులు సంబరాలు జరపాలి. రైతు వేదికల వద్ద నిర్వహించే కార్యక్రమానికి హాజరు కావాలి.

ఓసీపీ-2లో ఘోర ప్రమాదం

- హైవాల్ కూలి ఇద్దరు సజీవ సమాధి - మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ఆర్జీ-3 డివిజన్ పరిధి ఓసీపీ-2

◄ ఉప్పుల వెంకటేశ్వర్లు మృతదేహం

గాదం సాగర్ మృతదేహం ►

సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం సెకండ్ షిఫ్టులో క్వారీలోని హైవాల్ వద్ద పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు చేస్తుండగా ఒకేసారి మట్టి కూలింది. ఈ ఘటనలో సింగరేణి టెక్నీషియన్(ఫిట్టర్) ఉప్పుల వెంకటేశ్వర్లు(58), జనరల్ మజ్దూర్ కార్మికుడు గాదం సాగర్(55) మట్టిలో కూరుకుపోయి సజీవ సమాధి అయ్యారు. మరో ఇద్దరు జనరల్ మజ్దూర్ కార్మికులు శ్రీనివాస్‌రాజ్, మాదాం సమ్మయ్యలకు తీవ్రగాయాలయ్యాయి.

- 5లో..

ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఆసుపత్రిలో వైద్య సేవల గురించి అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జులై 17: జిల్లా ఆసుపత్రి ప్రాంగణం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంక్, ఫార్మసీ విభాగం, కంటి వైద్య విభాగం, దంత వైద్య విభాగం, టాయిలెట్లు, జనరల్ వార్డ్‌లను కలెక్టర్ పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉంటే వెంటనే తాత్కాలిక ప్రాతిపదికన నియామకం చేసేందుకు ఫైల్ పెట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఆసుపత్రి పారిశుధ్యం అంశంలో కొంత అసంతృప్తి వ్యక్తంచేసిన కలెక్టర్ రెగ్యులర్‌గా టాయిలెట్లను శుభ్రం చేయాలని, ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, డ్రైయినేజీలో ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సంబంధిత ఇంజనీర్లకు తెలియజేసి మరమ్మతు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఆసుపత్రి పారిశుధ్య కాంట్రాక్టర్ కు వెంటనే మెమో జారీ చేయాలని, పారిశుధ్య కార్మికులు రెగ్యులర్‌గా వచ్చి ఆస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేయని పక్షంలో వారిని విధుల నుంచి తొలగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాఆసుపత్రి ఆపరేషన్ విభాగంలో అవసరమైన ఆప్తమాలజిస్ట్ మైక్రోస్కోప్ ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. ఆస్పత్రిలో ఇద్దరు దంత వైద్యులు అందుబాటులో ఉన్నందున జిల్లా ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రిలో దంత వైద్య సేవలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాకాంత్, వైద్య అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

- నదుల్లో పుణ్యస్నానాలు, ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



శ్రీగౌతమేశ్వరాలయంలో చైర్‌పర్సన్ రమ, భక్తుల పూజలు

మంథని, జులై 17: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక గోదావరినదిలో భక్తులు బుధవారం పుణ్య స్నానాలు ఆచరించరించారు. అనంతరం నది తీరంలోని శ్రీ రామలింగేశ్వర, శ్రీపంచబ్రహ్మేశ్వర, శ్రీహనుమాన్, శ్రీగౌతమేశ్వర స్వామి, శ్రీసీతారామ, శ్రీసరస్వతీ మాత ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదిలో స్నానమాచరించిన భక్తులు పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నదితీరంలో భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, కౌన్సిలర్లు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘన టలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మంథని రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా గోదావరి నది పుణ్యస్నానాలు ఆచరించారు. ఈసందర్భంగా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించుకున్నారు. దీంతో ఉప్పట్ల, గుంజపడుగు, పోతారం, విలోచవరం, ఆరెంద గోదావరి నదిలో, ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

సుల్తానాబాద్ : తొలి ఏకాదశి పండుగను ప్రజలు ఘనం గా జరుపుకున్నారు. ఆషాఢ మాసంలో వచ్చే ఏకాధశి పర్వ దినం హిందువులకు తొలి పండుగ కావడంతో బుధవారం ఉదయాన్నే పవిత్ర స్నానాది కార్యక్రమాలు పూర్తి చేసుకుని తమ ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మూల విరాట్టుకు అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారలకు నూతన వస్త్రాలను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్దఎత్తున స్వామి వారికి వస్త్రాలు, పండ్లు, ఫలహారాలు, పుష్పాలు సమర్పిం చారు. ఆలయ చైర్మన్ పల్లా సదాలక్ష్మి మురళి దంపతులు తదితరులు పాల్గొన్నారు. పాత బజారులోని శివాలయంలో కూడా ఏకాదశి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అల్లెంకి సత్యనారాయణ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం తొలిఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జూలపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం తొలిఏకాదశి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోగల ఆలయాల్లో కుటుంబాల సమేతంగా ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఓదెల : మండలంలోని పలు క్షేత్రాల్లో గురువారం తొలి ఏకాదశి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. కుటుంబాలతో కలిసి పూజలు నిర్వహించారు.



పొత్కపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నేడు రుణమాఫీ సంబరాలు

కాల్వశ్రీరాంపూర్, జులై 17: మండల కేంద్రంలోని రైతు వేదికలో నేడు రుణమాఫీ సంబరాలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారి నాగార్జున తెలిపారు. రుణమాఫీ ద్వారా మొదటి విడుతలో భాగంగా శ్రీరాంపూర్ 315, ఎదులపూర్‌లో 74, రాతుపల్లి 169, పెగడపల్లి 291, మడిపల్లి 171, గంగారాం 169, మిర్జంపేట్ 203, కిష్టంపేట113, మొట్లపల్లి 171, తారుపల్లి 151, మాల్యాల 160, పందిళ్ళ 207, పెద్దంపేట్ 102, వెన్నంపల్లి 178, మంగపేట్ 137, కూనారం 227, జాఫర్‌ఖాన్‌పేట్ 19 మొత్తం 2789 మంది రైతులకు లబ్ధి చేకూరనుందని మండల వ్యవసాయాధికారి డీ నాగార్జున తెలిపారు. కావున గురువారం మధ్యాహ్నం రైతులు 3గంటలకు శ్రీరాంపూర్ రైతువేదికలో హాజరుకావాలని కోరారు. రుణమాఫీ ప్రకటించిన గురువారం రైతుల పాసు బుక్కుల్లో డబ్బులు పడనున్నట్టు ఏఓ తెలిపారు.

ఎలిగేడు : మండల కేంద్రంలోని (ఎలిగేడు)రైతువేధికలో గురువారం లక్ష లోపు రుణమాఫీ కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల18న మధ్యాహ్నం 3గంటలకు ఆయ రైతువేధికల్లో దృశ్య శ్రావణ మాధ్యమం ద్వారా మంత్రిచే పంట రుణమాఫీ కార్యక్రమం లాంచనంగా ప్రారంభమవుతుందని, రైతులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు ఏఈవోలు పద్మ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : రుణమాఫీ పథకం ప్రారంభం సందర్భంగా మండలంలోని రాఘవపూర్ రైతు వేదికలో గురువారం సంబరాలు నిర్వహించనున్నట్లు ఏవో అలివేణి తెలిపారు. లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులు హజరు కావాలని, మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారని తెలిపారు. రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రకటనలో కోరారు.

కమాన్‌పూర్, జులై 17 : మండలంలోని గుండారం గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో గురువారం రైతు రుణమాఫీ సంబరాలు జరగనున్నట్లు మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీని గురువారం మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. లబ్ధిదారులతో రైతు వేదికలలో ముఖాముఖి మాట్లాడనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

ముత్తారం, జులై 17 : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు నేడు మాఫీ చేయనున్నట్లు ఈ సందర్భంగా ముత్తారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు రైతు వేదికలో సీఎం రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు, రైతులు పాల్గొనాలని కోరారు.

రేపు పెద్దరాతుపల్లి, కొలనూర్‌కు మంత్రుల రాక

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

పెద్దపల్లి, జులై 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19న పెద్దపల్లి నియోజకవర్గంలోని పెద్దరాతుపల్లి, కొలనూర్‌లకు మంత్రులు రానున్నారని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. పామ్ ఆయిల్ సాగులో భాగంగా కాల్వశ్రీరాంపూర్ మండలం పెదరాతుపల్లిలో ఏర్పాటుచేయనున్న పామ్‌ఆయిల్ పరిశ్రమ నిర్మాణానికి, ఓదెల మండలం కొలనూర్‌లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని, రోడ్లను ఉదయం 9 గంటలకు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు ప్రారంభించనున్నారని తెలిపారు. అనంతరం ఇక్కడి నుంచి కరీంనగర్ చేరుకుని రైతుభరోసాపై అభిప్రాయ సేకరణకు ఉమ్మడి జిల్లా రైతులతో కలిసి నిర్వహించనున్న సమావేశంలో పాల్గొననున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను సందర్శించిన సింగరేణి డైరెక్టర్

కోల్‌సిటీ, జులై 17: రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్‌ఎఫ్‌సీఎల్)ను బుధవారం సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్ రెడ్డి సందర్శించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ జీఎం(ఓ అండ్‌ఎం) ఉదయ రాజహంస ప్రాజెక్టు గురించి సింగరేణి అధికారులకు వివరించారు. ప్లాంట్‌లో యూరియా ఉత్పత్తి, లిక్విడ్ అమ్మోనియా తయారీ విధానాలను వివరించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, ఎస్‌అండ్‌పీసీ జూనియర్ ఇన్‌స్పెక్టర్లు చంద శ్రీనివాస్, తిరుపతి ఉన్నారు.

దుద్దిళ్ల సోదరులపై అసత్య ఆరోపణలు..

- మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పెండ్రు రమ

మంథని, జులై 17: అధికార, ఉన్న లేకున్న నిరంతరం మంథని ప్రాంత ప్రజల అభివృద్ధి, సంక్షేమం పాటు పడే రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు దుద్దిళ్ళ శ్రీనుబాబులపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మరని మున్సిపల్ చైర్మన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, కాంగ్రెస్ నేతలు వొడ్నాల శ్రీనివాస్, ఎరుకల ప్రవీణ్, నూకల బానయ్య, మంథని సత్యం, ఆర్ల నాగరాజు, అజీంఖాన్‌లు వేర్వేరుగా వెల్లడించారు. బుధవారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీధర్ బాబుపై ఆసత్య ఆరోపణలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యలను వక్రీకరించి పుట్ట మధు మాట్లాడుతున్నారని విమర్శించారు. అభివృద్ధి పనుల్లో అక్రమాలకు పాల్పడే చరిత్ర తమ నాయకులది, తమ పార్టీ శ్రేణులది కాదన్నారు. దుద్దిళ్ళ సోదరులపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. తాము స్థానికులం కాదంటూ చేసిన ఆరోపణలు సైతం తీవ్రంగా ఖండిస్తున్నామని, తాను పుట్టి పెరిగిన ప్రాంతం, చదువుకున్న ప్రాంతం సైతం మంథని అని, తన స్థానికత విషయంలో ఏవైనా అనుమానాలు ఉంటే ఆయన సతీమణి పుట్ట శైలజను అడిగి తెలుసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ శ్రీపతి బానయ్య, నేతలు పోలు శివ, గోటికార్ కిషన్‌జీ, పేరవేన లింగయ్య యాదవ్, జనగామ నర్సింగరావు, పర్శవేన మోహన్, పార్వతి కిరణ్, ఐలి శ్రీనివాస్, కౌన్సిలర్లు చొప్పకట్ల హనుమంతు, వీకే. రవి, గుండా విజయలక్ష్మి-పాపారావు, నక్క నాగేంద్ర-శంకర్, కొట్టే పద్మ-రమేష్, వేముల లక్ష్మి- సమ్మయ్యలు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య

పెద్దపల్లి రూరల్, జూలై 17: మండలంలోని రాగినేడుకు చెందిన నక్క కొమురయ్య (85) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నినెలల క్రితం కొమురయ్య భార్య రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఒంటరి తనాన్ని భరించలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కూతురు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

వేములవాడ టౌన్, జూలై 17: కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన వేములవాడ మండలం అగ్రహారం గ్రామ శివారులో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అగ్రహారం నుంచి నంది కమాన్ వైపు ద్విచక్ర వాహనంపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధనుంజయ్, పఠాన్ అనే ఇద్దరు వ్యక్తులు వెళుతుండగా కారు ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. దీంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న ధనుంజయ్, పఠాన్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ధర్మారం, జూలై 17: మండలంలోని దొంగతుర్తి గ్రామానికి చెందిన కారపూరి రాజ్‌కుమార్ (20) అనే యువకుడు బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రాజ్‌కుమార్ మద్యానికి, సిగరెట్లుకు బానిసయ్యాడు. గమనించిన తండ్రి మొగిలి సిగరెట్లు, మద్యం తాగడం మానెయ్యమని మందలించాడు. దీనితో జీవితంపై విరక్తి చెంది ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

గొర్లు, నాటు కోళ్లు అపహరణ

కోనరావుపేట, జూలై 17: మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన గొర్లు, రామన్నపేట గ్రామానికి చెందిన మరో రైతు నాటుకోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఉప్పుల భూమయ్య అనే రైతుకు చెందిన లక్ష రూపాయల విలువల గొర్లు, రామన్నపేట గ్రామానికి చెందిన భూమయ్యకు సంబంధించిన 25 నాటు కోళ్లను తమ పొలం వద్ద ఉంచారు. మంగళవారం రాత్రి ఆటోలో వచ్చి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు తెలిపారు. కోనరావుపేట ఎస్సై ఆంజనేయులుకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసుకున్నట్లు తెలిపారు.

ఓసీపీ-2లో ఇద్దరు కార్మికుల సజీవ సమాధి

- మరో ఇద్దరు కార్మికులకు గాయాలు

రామగిరి, జూలై 17: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధి ఓసీపీ-2లో ఇద్దరు కార్మికులు సజీవ సమాధి అయ్యారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం లో ఈ ఘటన చోటు చేసుకుంది. బుధవారం సెకండ్ షిఫ్టులో క్వారీలోని హైవాల్ వద్ద పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులు చేస్తుండగా ఒకేసారి మట్టి కూలింది. ఈ ఘటనలో సింగరేణి టెక్నీషియన్(ఫిట్టర్) ఉప్పుల వెంకటేశ్వర్లు(58), జనరల్ మజ్దూర్ కార్మికుడు గాదం సాగర్(55) మట్టిలో కూరుకుపోయి సజీవ సమాధి అయ్యారు. మరో ఇద్దరు జనరల్ మజ్దూర్ కార్మికులు శ్రీనివాస్‌రాజ్, మాదాం సమ్మయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. క్వారీలోని సౌత్ కోల్ ఏరియాలో సైడ్‌వాల్ లోపల పైప్ లీకేజీ మరమ్మతులు చేస్తుండగా అకస్మాత్తుగా వెంకటేశ్వర్లు, విద్యాసాగర్‌లపై హైవాల్‌లో బురద మట్టి(ఓబీ) వర్షానికి నాని పెద్దమొత్తంలో కూలింది. దీంతో వారు సజీవ సమాధి అయ్యారు. అక్కడే పనిచేస్తున్న శ్రీని వాస్ రాజ్, మాదాం సమ్మయ్యలపై కూలిన మట్టిలో వచ్చిన బండరాళ్ల తగల డంతో తీవ్రంగా గాయపడ్డారు. క్వారీలోని మిగతా కార్మికులు ఘట నా స్థలానికి చేరుకొని కూలిన మట్టిని షావల్ సహాయంతో తొలగించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. గాయపడిన కార్మికులను తొలుత స్థానిక సెంటినరీకాలనీలోని డిస్పెన్సరీలో ప్రథమ చికిత్స అందించి తర్వా త గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో ఉప్పుల వెంకటేశ్వర్లు హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన వ్యక్తి కాగా గాదం విద్యాసా గర్ గోదావరిఖనికి చెందిన వ్యక్తి. మృతదేహాలను గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి మార్చ్యురీకి తరలించారు.



గాయపడిన ఎర్ర శ్రీనివాసురాజ్, మాదాం సమ్మయ్య, బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



ఉప్పుల వెంకటేశ్వర్లు(ఫైల్), జి విద్యాసాగర్(ఫైల్)

● ఆర్జీ-3 డివిజన్ ఓసీపీ-2లో కక్ష సాధింపులు ఎక్కువగా జరుగుతు న్నాయని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వెంకటేశ్వర్లును కక్ష సాధింపు ధోరణిలో భాగంగానే షిఫ్ట్ మార్చు చేపట్టారనే ఆరోపణలు వ్యక్తం అవుతు న్నాయి. పంప్ సెక్షన్‌కు మార్చు చేయ డం మూలంగానే ఈ ఘటనకు ఆస్కారం ఏర్పడిందని కార్మికనేతల నుం చి బలంగా వినిపిస్తోంది. షిఫ్టు మార్పుతోనే ఇటీవల ఆంజనేయులు గుండెపోటుతో మృతి చెందినట్లు సింగరేణిపై ఆరోపణలు ఉన్నాయి. వరు స ప్రమాదాలకు సింగరేణి బాధ్యత వహించాలని యూనియన్ నాయకు లు డిమాండ్ చేస్తున్నారు.

● బాధిత కుటుంబాలకు పరామర్శ..

సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో బుధవారం హైవాల్ కూలిన ప్రమాదంలో సజీవ సమాధి అయిన ఉప్పుల వెంకటేశ్వర్లు, గాదం విద్యాసాగర్ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించి ధైర్యం చెప్పారు. గాయపడిన శ్రీనివాస్‌రాజ్, మాదం సమ్మయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో యూనియన్ నాయకులు గౌతం శంకరయ్య, ఎంఆర్‌సీ రెడ్డి, యాదగిరి సత్తయ్య, అరకాల ప్రసాద్, కోట రవీందర్‌రెడ్డి, కుమార్, కార్మికులు ఉన్నారు.

24 గంటల వ్యవధిలో భార్యాభర్తల మృతి

- మానకొండూర్ మండలం బంజెరుపల్లిలో విషాదం



తోట మల్లయ్య, రాజలచ్చమ్మ(ఫైల్)

మానకొండూర్, జూలై 17: కష్టసుఖాల్లో భార్యాభర్తలు కలిసిమెలిసి బతికారు.. ఒకరిని విడిచి ఒకరు ఉండలేక 24 గంటల వ్యవధిలో ఇద్దరూ మృతి చెందారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని కొండపల్కల శివారు గ్రామమైన బంజెరుపల్లిలో భర్త మృతిని తట్టుకోలేక భార్య హఠాన్మరణం చెందింది. కొండపల్కల శివారు గ్రామం బంజెరుపల్లికి చెందిన తోట మల్లయ్య (75) అనే వృద్ధుడు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. కాగా బుధవారం మల్లయ్య అంత్రక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా భార్య తోట రాజలచ్చమ్మ (70) భర్త మృతిని తట్టుకోలేక హఠాన్మరణం చెందింది. బుధవారం సాయంత్రం భార్యాభర్తల అంత్యక్రియలు పూర్తిచేశారు. ఇద్దరి మృతితో పండుగపూట గ్రామంలో విషాదం నెలకొంది.

పిచ్చికుక్కల దాడిలో 20మందికి గాయాలు

హుజూరాబాద్, జూలై 17: హుజూరాబాద్ పట్టణంలోని పలు వీధుల్లో బుధవారం పిచ్చి కుక్కల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. పట్టణంలోని విద్యానగర్, గాంధీనగర్, ప్రతాపవాడ, మామిండ్లవాడ, కిందివాడ తదితర కాలనీల్లో వీధి కుక్కలు ఎక్కువయ్యాయి. రోడ్డుపై వెళ్తున్న బాటసారులను గాయాల పాలు చేస్తున్నాయి. పట్టణంలో 20మందికి కుక్కల దాడిలో గాయాలు కాగా వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి మృతి

వీణవంక, జూలై 17: మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన మడిపల్లి మొగులయ్య (68) అనే వృద్ధుడిని ట్రాక్టర్ ఢీకొనగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. మొగులయ్య మంగళవారం రాత్రి సొంత పనిమీద శ్రీరాములపేట గ్రామానికి వెళ్ళి తిరిగి వస్తున్నాడు. మార్గం మధ్యలో నర్సింహులపల్లి గ్రామానికి చెందిన వంతడుపుల సమ్మయ్య తన ట్రాక్టర్‌తో వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో మొగులయ్యకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో హుజురాబాద్ ప్రభుత్వ అసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కూమారుడు మడిపల్లి నరేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

మల్యాల, జూలై 17: బహిర్భూమికి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు వరి పొలంలో జారి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముత్యంపేటకు చెందిన మల్యాల గంగాధర్(40)అనే వ్యక్తి బుధవారం తోటి మిత్రులతో కలిసి కొండగట్టు సమీపంలోని మారుతీ టౌన్ షిప్ వద్ద విందు చేసుకున్నారు. అనంతరం కాసేపటికి బహిర్భూమికి వెళ్లి అక్కడి నుంచి వరి పొలం వద్దకు వెళ్లగా అక్కడ ప్రమాదవశత్తూ కాలు జారి పొలంలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



శ్రావణి(ఫైల్)

భీమారం, జూలై 17: భీమారం మండలంలోని కమ్మరిపేట గ్రామానికి చెందిన తిపిరి శ్రావణి(27) అనే వివాహిత బుధవారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. బార్యాభర్తల మధ్య మనస్పర్థలతో శ్రావణి బుధవారం ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన భర్త నరేష్ స్థానికుల సహాయంతో హుటాహుటిన జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు శ్రావన్స్(4), రుద్రాన్ష్(1) ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అప్పటివరకు అందరితో కలివిడిగా ఉన్న శ్రావణి క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం తన ఇద్దరు పిల్లలతో పాటు కుటుంబీకులకు కడుపుకోతను మిగిల్చింది.

గంజాయి నిందితుడి అరెస్ట్

వేములవాడ టౌన్, జూలై 17: ఆరు నెలలుగా తప్పించుకు తిరుగుతున్న గంజాయి నిందుతుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ బుధవారం వెల్లడించారు. వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జనవరి 31వ తేదీన గంజాయితో పట్టుబడ్డ సాయికుమార్, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, రమేష్‌లను విచారించారు. దీంతో సదరు నలుగురు వ్యక్తులు మరో నలుగురు అమీర్, వెంకటేష్, అభి, రవిల నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో అమీర్, వెంకటేష్, అభి, రవిలను విచారించగా చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్ గంజాయిని సరఫరా చేస్తున్నట్లు విచారణలో పోలీసులకు తెలిపారు. ఈ మేరకు అందరిపై కేసు నమోదు చేశామని అప్పటి నుంచి పరారీలో వున్న తోట అఖిల్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

జగిత్యాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. బుధవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 4,468 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 13.833 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 22.866 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 436 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 8.212 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.898 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో యువకుడి ఆత్మహత్యాయత్నం



చందుర్తి జూలై 17: గంజాయి కేసు విషయంలో పోలీసులు తనను అన్యాయంగా తీసుకొచ్చారని రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో యువకుడు బుధవారం ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఏడాది జనవరిలో వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది మందిపై నమోదైన గంజాయి కేసులో చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన తోట అఖిల్ నిందితుడిగా ఉన్నాడు. అప్పటి నుంచి అఖిల్ పరారీలో ఉండగా పోలీసులు గాలిస్తున్నారు. అఖిల్ గ్రామంలో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వేములవాడ రూరల్ పోలీసులకు అప్పగించారు. వారు వేములవాడకు తరలించేందుకు సిద్ధమవ్వగా తన వద్ద ఉన్న బ్లేడ్‌తో అఖిల్ ఎడమ చేతిపై, కుడి కాలుపై కోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు. చికిత్స నిమిత్తం చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి అంబులెన్స్‌లో వేములవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అఖిల్ మాట్లాడుతూ పోలీసులు తనను అన్యాయంగా పట్టుకొచ్చారని, అందుకనే చేయి, కాలుపై బ్లేడుతో కోసుకున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆత్మహత్యకు యత్నించిన తోట అఖిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

మస్కట్‌లో యువకుడి ఆత్మహత్య

- మృతదేహాన్ని స్వగ్రామం తెప్పించాలని వేడుకోలు



విజయ్ (ఫైల్)

వేములవాడ టౌన్, జూలై 17: వేములవాడ రూరల్ మండలం అచ్చనపల్లి గ్రామానికి చెందిన యువకుడు మస్కట్ (ఓమన్)లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చన్నపల్లి గ్రామానికి చెందిన మాదాసు విజయ్(33) అనే యువకుడు నాలుగు సంవత్సరాలుగా మస్కట్ దేశానికి ఉపాధి నిమిత్తం వెలుతూ వస్తున్నాడు. ఆరు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్లిన విజయ్ ఈ నెల 13వ తేదీన తను ఉంటున్న రూమ్‌లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల బాధతోనే మృతి చెందినట్లు పలువురు చెప్పగా మస్కట్‌లో ఓ ఆంధ్రా అ మ్మాయితో పరిచయం అయిందని, ఆమెతో కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడని వారి ఇద్దరి మధ్య మాట మాట పెరిగి ఆత్మహత్య చేసుకునేందుకు దారి తీసిందని గ్రామస్థులు చెబుతున్నారు. చేతికి అందిన కొడుకు ఏడారి దేశంలో మృతి చెందడంతో మృతుడి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజయ్ తల్లిదండ్రులు దేవయ్య, మంజుల వేడుకుంటున్నారు.

ఒకే గదిలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు



ముత్యంపేటలో ఒకే గదిలో కూర్చున్న మూడు అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలు, టీచర్లు

మల్లాపూర్, జూలై 17: మాతా శిశు సంరక్షణలో భాగంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం నుంచి ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు వయసున్న పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య నేర్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ పలు కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేశాయి. కనీసం సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో కేంద్రాలు నిర్వహింస్తున్నారు. దీంతో చిన్నారులు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఒకే గదిలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను టీచర్లు నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిచండానికి స్వంత భవనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్వంత భవనాలు లేని కేంద్రాలకు ప్రతి నెలా రూ. వెయ్యి చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. కనీస సౌకర్యాల్లేని ఒక అద్దె గదిలో కొనసాగుతున్న దానిలో మూడు కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి అద్దె గదిలోనే సామగ్రిని భద్రపర్చడం, ఒక పూట భోజనం వండి పెట్టడం, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించడం వంటి పనులన్నీ ఒకే చోటే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇరుకు గదిలో చిన్నారులకు ఊపిరి ఆడని పరిస్థితి చేస్తుంది. మూత్రశాలలు, నీటి సరఫరా తదితర సౌకర్యాలు లేని ఇరుకైన అద్దె గదిలో నిర్వహిస్తున్న కేంద్రాలకు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదని ఆరోపణాలు లేకపోలేదు. ఒక గదిలో మూడు కేంద్రాల నిర్వహన గురించి అంగన్‌వాడీ సూపర్ వైజర్ శంకరమ్మను వివిరణ కోరగా తర్వలోనే విడివిడిగా నిర్వహించెందుకు ప్రయత్నలు చేస్తున్నమన్నారు. కేంద్రాలను నిర్వహించడానికి తగిన గదులను పరిశీలిస్తున్నమని, విద్యార్థులకు గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు.

తల్వార్‌తో విన్యాసాలు చేస్తున్న యువకుడి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 17: ద్విచక్రవాహనాలపై చక్కర్లు కొడుతూ తల్వార్, కత్తులతో విన్యాసాలు చేస్తున్న సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన తోటిచర్ల సాయివర్ధన్(22) అనే యువకుడిని బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. విన్యాసాలకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రాంలో అప్‌లోడ్‌చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే అతనిపై ఆయుధాల చట్టం కింద కేసు నమోదుచేసి అరెస్ట్‌చేశామని సీఐ తెలిపారు. యువకుడి వద్ద తల్వార్, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే నూతన చట్టాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఒప్పంద కార్మికుల నిరసన

వేములవాడ కల్చరల్ , జూలై 17: రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులు రాజన్న ఆలయ కార్య నిర్వహణ అధికారి కార్యాలయం ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. జూన్ నెలకు సంబంధించిన వేతనం ఇంతవరకు తమకు చెల్లించలేదని 40 మంది కార్మికులు సుమారు అరగంటసేపు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. శానిటేషన్, గోశాల, ఇంజనీరింగ్ విభాగాల చెందిన కార్మికులు తమ వేతన చెల్లింపులో జాప్యం జరిగిందని నిరసన వ్యక్తం చేయగా విషయం తెలుసుకున్న ఈవో వినోద్ రెడ్డి సంబంధిత ఏజెన్సీలను మందలించినట్లు తెలిసింది. ఇకపై ప్రతినెల 10 తేదీ లోపు వేతనం వచ్చేలా చూస్తానని హామీ ఇవ్వడంతో కార్మికులు నిరసనను విరమింపచేసినట్లు ఈవో తెలిపారు.

ఊపందుకున్న వరినాట్లు

- గంగాధరలో 13.5 సెం.మీ వర్షపాతం నమోదు

- పత్తికి ప్రతికూలం.. వరికి అనుకూలం



లక్ష్మీదేవిపల్లిలో నాట్లు వేస్తున్న మహారాష్ట్ర కూలీలు

గంగాధర, జూలై 17: మండలంలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. కొన్ని రోజులుగా వర్షానికై ఎంతో ఆశతో ఎదురు చూసిన రైతన్నలకు రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి సంతోషం వ్యక్తం చేశారు. సాగునీటి కోసం తండ్లాడిన రైతులకు వర్షానికి పొలాల్లో నిలిచిన నీటిని వినియోగించుకున్నారు. నీరు భూమిలోకి ఇంకక ముందే గంగాధర, కురిక్యాల, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, ఉప్పరమల్యాలతో పాటు పలు గ్రామాల్లో రాత్రి నుంచి తెల్లారే వరకు మడులను ట్రాక్టర్లతో దున్నించారు. దీంతో పది రోజులుగా నాట్లకు వచ్చిన నారు వేయడానికి సిద్ధమవడంతో రైతులు కూలీలను వెదికే పనిలో పడ్డారు. మరో వైపు ఎడతెరిపిలేకుండా రెండు గంటల పాటు కురిసిన వర్షానికి పొలం గట్లన్నీ తెగిపోయాయి. గంగాధర మండలంలో 13.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బావుల్లో అడుగునున్న నీరు వర్షంతో క్రమక్రమంగా పెరుగుతోం ది. మండలంలో కురిసిన వర్షం పత్తికి ప్రతికూలంగా మారింది. పత్తి రెండో దశ కలుపు తీయడానికి సిద్ధంగా ఉండి వర్షం లేక భూమి ఎండి పోవడంతో కలుపు తీయడానికి వీలుపడలేదు. పత్తిలో ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు రైతులను కలవర పెట్టింది. ఇటీవల కురిసిన వర్షంతో చుట్టుపక్కల మండలాల నుంచి పత్తి కలుపుతీయడానికి కూలీలను రప్పిస్తున్నారు. వర్షం పత్తి రైతుకు ఎంతో ఉపయోగపడిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల వరకు భూమిలో పదను ఉండనుండగా కూలీలు ఎప్పుడు దొరికితే అప్పుడు కలుపు తీయించి అడుగు మందుకు వేయడానికి రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. ఇక వరి నాట్లు వేయడానికి మండలంలో పలు గ్రామాల్లో బీహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన కూలీలు పనుల్లో పూర్తిగా బిజీగా ఉండి నాట్లు వేయడానికి రైతులకు తేదీలను ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలతో స్థానిక కూలీలకు పని అడపదడపా లభిస్తుండగా, వారి పద్ధతిలోనే ఇక్కడి కూలీలు ఎకరాకు గుత్తగా మాట్లాడుకుని నాట్లు వేస్తున్నారు. దీంతో రైతుకు నాట్లు వేయడాని గతంలో మాదిరిగా వరి పరచడానికి మగ కూలీ తప్పింది. పదిహేను రోజులుగా వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు మండలంలో కురిసిన భారీ వర్షంతో సంతోషం వ్యక్తం చేస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

అప్రమత్తతే శ్రీరామ రక్ష

- ● సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- ● పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- ● దోమలు పెరగకుండా చూసుకోవాలి
- ● గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

వెల్గటూర్, జూలై 17: దోమలు చిన్నవే కానీ వాటి వలన వచ్చే జబ్బులు మాత్రం పెద్దవే. వర్షాకాలం ప్రారంభం అయిందంటే దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయి. తద్వారా వ్యాధులు కూడా అంతే మొత్తంలో వ్యాప్తి చెందుతాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వలన దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలతో ఆసుపత్రులకు చేరుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. వానా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులకు ఆదిలోనే అడ్డుకట్ట వేయకపోతే భారీ మూల్యం చెల్లించక తప్పదు. సీజనల్ వ్యాధులకు కారకమైన దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా ఎవరికి వారే ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చు. ముఖ్యంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిలువ ఉండకుండా చూడడం, మురుగు నీరు రాకుండా చూసుకోవడం అత్యంత ఆవశ్యకం. దోమకాటుతో డెంగీ, టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా, జికా వైరస్, మెదడు వాపు, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. సీజనల్ వ్యాధులపై గ్రామాలలో వైద్య శాఖ ఆధ్వర్యంలో అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, వెల్గటూర్, వైద్య శాఖ అధికారులు గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

● డెంగీతో పొంచి ఉన్న ప్రమాదం..

సీజనల్ వ్యాధుల్లో ప్రమాదకరమైనది డెంగీ. ఏడిస్ ఈజిప్ట్ అనే దోమ కాటు వలన డెంగీ వ్యాధి వస్తుంది. డెంగీ వ్యాధి ఫ్లెవీ అనే సూక్ష్మజీవి ద్వారా వ్యాపిస్తుంది. డెంగీకి కారణమైన దోమ నల్లగా ఉండి మచ్చలు ఉంటాయి. ఇది పగటి పూట మాత్రమే కుడుతుంది. ఈ దోమ కుట్టిన నాలుగు నుండి పది రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు బయట పడతాయి. ఈ దోమ కుట్టడం వలన రక్త కణాల సంఖ్య పడిపోయి ఒక్కోసారి మరణం వరకు దారి తీస్తుంది. ముందు జాగ్రత్త అవసరమని ఎవరికి వారు స్వంత వైద్యం చేసుకోవద్దని వైద్య శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మూతలు లేని నీటి ట్యాంకులు, రోడ్లపై నిలిచే మురుగు నీరు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఇనుప డబ్బాలు, పగిలిన కుండీలు, కూలర్లలో నిలువ ఉండే నీటిలో డెంగీ కారక దోమలు పెరుగుతాయి. ఒక్కో డెంగీ దోమ మూడు సార్లు గుడ్లు పెడుతుంది. ఒక్కో సారి 300 చొప్పున మొత్తం 900 గుడ్లు పెడుతుంది. దాదాపు ఆరు నెలల వరకు గుడ్లు ఉంటాయి. ఒక్క సారి నీరు తగలగానే లార్వా ఉత్పత్తి జరిగి డెంగీ దోమగా రూపాంతరం చెందుతుంది. ఈ దోమలు పూర్తి స్థాయిలో వ్యాపించకుండా ఉండాలంటే నీరు నిలువ ఉండకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఉమ్మడి మండలంలో డెంగీ కేసులు..

ఉమ్మడి వెల్గటూర్ మండలంలో ఇప్పటి వరకు మూడు డెంగీ కేసులు నమోదు అయినట్లు వైద్యశాఖ అధికారులు తెలిపారు. ఎండపల్లిలో ఇద్దరికి, పాతగూడూర్‌లో ఒక్కరికి డెంగీ జ్వరం సోకినట్లు అధికారికంగా ప్రకటించినప్పటికీ అనధికారికంగా ఈ సంఖ్య ఎక్కువగానే అవకాశం ఉంది. ఎందుకంటే ప్రైవేట్ ఆసుపత్రుల్లో జ్వరంతో చేరుతున్న వారి సంఖ్య ఈ మధ్య కాలంలో అధికంగా ఉంటోంది. గ్రామాలలో ఆర్ఎంపీ, పీఎంపీల వద్ద కూడా జ్వర బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. కాగా డెంగీ పాజిటివ్ వచ్చిన వారి ఇళ్లను జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్, ఏఎంవో సత్యనారాయణ, మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్‌లు పరిశీలించి ఫైరిత్రిమ్‌ను స్ప్రే చేయించారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

● అప్రమత్తత అవసరం


- జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తత చాలా అవసరం. ప్రతీ ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చుట్టు పక్కల నీరు నిల్వ ఉండకుండా చూడాలి. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూడడం ద్వారా సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చు.

మతిస్థిమితం లేని యువతిపై దాడి

- స్తంభానికి కట్టేసి కొట్టిన దుకాణాల యజమానులు



శిరీషను విద్యుత్ స్తంభానికి కట్టేసిన దుకాణాల యజమానులు

సిరిసిల్ల టౌన్, జూలై 17: మానవత్వం మరిచారు.. మతిస్థిమితం లేని యువతి అని తెలిసి కూడా చాక్లెట్లు దొంగతనం చేసిందని కట్టేసి కొట్టారు. దెబ్బలకు తాళలేక బక్కచిక్కిన ఆ యువతి అల్లాడినా వారి మనస్సు మాత్రం కరగలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్న సంఘటన అక్కడున్న వారిని కలిచివేసింది. స్థానికుల వివరాల ప్రకారం... రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేటకు చెందిన జగిత్యాల శిరిషా పుట్టుకతోనే మతిస్థిమితం సరిగా ఉండేది కాదు. కొన్ని నెలలు క్రితం తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించగా కొంచెం ఆరోగ్యం కుదటపడడంతో తిరిగి సిరిసిల్లకు తీసుకొచ్చారు.. బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్ చౌరస్తా వద్ద ఉన్న ఓ పాన్‌షాప్‌లోని డబ్బాలో ఉన్న చాక్లెట్లు తీస్తుండగా షాప్ యజమాని పట్టుకున్నాడు. దీంతో యువతి తప్పించుకోవడానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న కూరగాయాలు అమ్మే ఓ మహిళ, చికెన్ సెంటర్ యజమాని, మరో వ్యక్తి పట్టుకున్నారు. రాళ్లతో దాడి చేస్తుందని అక్కడే ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టేసి విచక్షణ రహితంగా కొట్టారు. ఆ దెబ్బలకు తాళలేక యువతి అల్లాడింది. అక్కడ ఉన్న జనం పోగయ్యారు. యువతి గురించి తెలిసినవారు ఆమెకు మతిస్థిమితం లేదు వదిలేయాలని చెప్పారు. అయినా మతిస్థిమితం లేని యువతిపై దాడి చేయడాన్ని చూసిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటన స్థలా నికి చేరుకున్న పోలీసులు యువతిని విడిపించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు.

ఘనంగా మొహర్రం వేడుకలు


గోదావరిఖనిలో పీరీలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


కాల్వశ్రీరాంపూర్‌లో పీరీలతో ఊరేగింపు..


కనగర్తిలో పీరీల ఊరేగింపు..

కళ్యాణ్‌నగర్, జూలై 17: మొహర్రం పర్వదినం బుధవారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. హిందు, ముస్లీం మతాలకు అతీతంగా జరుపుకునే ఈ పర్వదినంలో తొమ్మిది రోజులుగా పీరీలకు పూజలు చేశారు. శనివారం పీరీల నిమజ్జనోత్సవంలో భాగంగా తొమ్మిది రోజులుగా పూజలు చేసి పీరీలను వాడవాడలా దప్పు చప్పుళ్ల మధ్య ఊరేగించి ప్రధాన చౌరస్తాకు చేరుకున్నారు. సాయంత్రం ప్రధాన చౌరస్తా కూడళ్లలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సింగరేణి సంస్థకు సెలవు దినం కావడంతో కార్మిక కుటుంబాలు ఇంటిల్లిపాది వచ్చి మొక్కులు చెల్లించారు. దీంతో ప్రధాన చౌరస్తా-శివాజీనగర్ ప్రాంతమంతా రద్దీగా మారింది.

కాల్వశ్రీరాంపూర్, జూలై 17: మండలంలోని ఆయా గ్రామాల్లో మొహరం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హిందూ ముస్లింలు పీరీలతో వాడవాడలు తిరిగి ఇంటింటా పీరీలతో దర్శనమిచ్చారు. మడిపెల్లి, కాల్వశ్రీరాంపూర్, గంగారం, పెద్దరాత్‌పెల్లి, మోట్లపెల్లి తదితర గ్రామాల్లో పీరీల పండుగ అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మటికీలు నిర్వహించారు. అగ్నిగుండంలో కట్టెలు వేసి పీరీలను దర్శించుకున్నారు.

ఎలిగేడు, జూలై 17 : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మోహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

సుల్తానాబాద్, జూలై 17: పీరీల పండుగను సుల్తానాబాద్‌లో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పాత జెండా వద్ద ఏర్పాటు చేసిన పీరీల వద్దకు కుల మతాలకు అతీతంగా ప్రజలు పూజలు చేశారు. పండుగ నిర్వాహకులు పీరీలను అలంకరించుకుని పట్టణంలోని పలు వార్డుల్లో డప్పుచప్పుళ్లతో ఊరేగిస్తూ వాటిని ఇంటింటికి తిప్పారు. భక్తులు ఈ సందర్భంగా పీరీలకు కుడుకలు దండలు పూల దండలు వేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని కనుకుల తదితర గ్రామాల్లో కూడా పీరీల పండగను జరుపుకున్నారు.

పెద్దపల్లి రూరల్, జూలై 17 : మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్దబొంకూర్, రాగినేడు, తుర్కలమద్దికుంట, పెద్దబొంకూర్, కనగర్తి, బ్రాహ్మణపల్లి, అందుగులపల్లి, గౌరెడ్డిపేట గ్రామాల్లో మొహర్రం సందర్భంగా మట్కీలు నిర్వహించిన అనంతరం పీరీలతో గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కులమతాలకు అతీతంగా పీరీలకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు, పురుషులు అనే తేడా లేకుండా పీరీలకు కూడుకలు, నూతన వస్త్రాలు కట్టిన అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం మండలంలోని కనగర్తి, కాపులపల్లి గ్రామాల్లో పీరీలతో ఊరేగించగా ప్రజలు మొక్కులు తీర్చుకున్నారు.

ఓదెల : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఓదెలతోపా టు జీలకుంట, గూడెం, కనగర్తి, కొలనూర్‌తోపాటు తదితర గ్రామాల్లో పీరీలతో ఘనంగా ఊరేగించారు. నిర్వహించిన ఈవేడుకల్లో పలువురు మొక్కులు తీర్చుకున్నారు. వివిధ వేషధారణలతో పీరీల వేడుకలు ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాల్లో పార్టీల నాయకులు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జూలై 17 : మండల వ్యాప్తంగా మొహర్రం వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. గత పదిరోజులుగా మండలంలోని జూలపల్లి, గుండారం, పేరపల్లి, రొంపికుంట, పెంచికల్‌పేట, కమాన్‌పూర్ తదితర గ్రామాల్లో ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో పీరీలను రంగురంగుల పూలతో అలకరించి ఆయా గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మసీదుల వద్ద భారీ ఎత్తున భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే పీరీలకు దట్టీలు కుడుకలు సమర్పించారు. అనంతరం సాయంత్రం ఆయా గ్రామాల్లోని చెరువుల్లో వద్దకు వెళ్లి పీరీలను శాంతింపజేశారు. ఆయా గ్రామాల్లో కులమతాలకతీతంగా మొహర్రం వేడుకలను నిర్వహించుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మామిడాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో బందోబస్తు నిర్వహించారు.

మంథని, జూలై 17: మంథని పట్టణంలో మోహర్రం వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక దొంతులవాడలోని మజీద్ వద్ద వారం క్రితం ఏర్పాటు చేసిన పీర్లను హిందూ భక్తులు, ముస్లింలు భక్తిశ్రద్ధలతో పూజించారు. మొక్కులు చెల్లించుకుని రాత్రి స్థానిక చెరువులో పీర్లను నిమ్మజనం చేశారు.


కమాన్‌పూర్‌లో పీర్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రజలు

నైనీ బ్లాకులో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించాలి

మందమర్రిటౌన్, జూలై 17: ఒడిశారాష్ట్రంలోని నైనీబ్లాకులో బొగ్గు ఉత్పత్తి కోసం ప్రణాళికలు రూపొందించి వీలైనంత త్వరగా ఉత్పత్తి ప్రారంభించేలా చూడాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి సీఎండీ బలరాం, ఎనర్జీ సెక్రెటరీ రొనాల్డ్‌రోస్, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్, ఇందనశాఖ ఓఎస్‌డీ సురేందర్‌రెడ్డికి సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నిర్వహించిన నైనీ బ్లాకులో ఉత్పత్తికి సంబంధించిన సమీక్ష సమావేశంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడారు. నాలుగు నెలల్లో ఈ బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైతే సింగరేణికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సింగరేణి తొలిసారిగా తెలంగాణ పక్క రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టు అయినందున కంపెనీ ప్రతిష్ఠను పెంచేలా కృషి చేయాలన్నారు. నైనీబ్లాకుకు అన్ని అనుమతులు లభించిన నేపథ్యంలో 783.27హెక్టార్ల అటవీస్థలంలో చెట్లలెక్కింపు, వాటి తొలగింపు, అప్పగింతపై ఒడిస్సా ముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించినం దున అటవీశాఖతో సంప్రదింపులు జరపాలన్నారు. ఇందుకోసం నైనీ జీఎంకు బాధ్యతలు అప్పగించారు. ఏకైక నిర్వాసిత గ్రామప్రజలతో చండీపడ ఎమ్మెల్యే అగస్తిబెహారా స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి పునరావాసం, ఉపాధికోసం తగిన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గరపడ నుంచి చండీపడ వరకు రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. హైటెక్షన్ లైన్‌లను నిర్మించేలా రాష్ట్ర శాఖ అధికారులతో సంప్రదించాలన్నారు. పునరావాసం, నష్టపరిహారం అంశాలపై చర్చించి ఆర్‌పీడీఏసీ సమావేశం అతి త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. 2015లో సింగరేణికి నైనీ బ్లాకు కేటాయించినప్పటికీ గత ప్రభుత్వ నిరాసక్తతవల్ల బొగ్గు ఉత్పత్తి ప్రారంభం కాలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని సమస్యలు పరిష్కరించామన్నారు. త్వరగా నైనిబ్లాకు నుంచి బొగ్గు ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎండీ బలరాం మాట్లాడుతూ బొగ్గు బ్లాకుల ప్రత్యేక తపై శ్రద్ధ చూపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. అక్టోబర్‌లోగా బొగ్గు ఉత్పత్తికి కృషి చేస్తామని తెలిపారు.

ఓపెన్ జిమ్‌కు భూమి పూజ

భగత్‌నగర్, జూలై17: కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో ఎస్‌జీఎఫ్ నిధులతో ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌కు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై దృష్టి సారించి వ్యాయామం చేయాలని సూచించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్, నాయకులు కేడూరి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కిష్టంపేట మీర్జంపేట రోడ్డు

కాల్వశ్రీరాంపూర్, జూలై 17: కిష్టంపేట-మిర్జంపేట రోడ్డు అధ్వానంగా తయారైంది. మండలంలోని మోట్లపెల్లి, కిష్టంపేట, మిర్జంపేట మీదుగా ప్రతిరోజు జమ్మికుంట-గోదావరిఖని బస్సులు నడుస్తుంటాయి. అదేవిధంగా భూపాలపల్లి జిల్లా వెంకట్రావుపల్లె, గరివిండ్లపెల్లి, బోర్నపల్లి నుంచి కూడా కిష్టంపేట, మిర్జంపేట ద్వారా జమ్మికుంటకు ప్రతిరోజు పోయి వస్తుంటారు. ఈ గ్రామాలతో పాటు మండలంలోని పలు గ్రామాల రైతులు తాము పండించిన పత్తిని అమ్మేందుకు జమ్మికుంట మార్కెట్‌కు వాహనాల ద్వారా తరలిస్తుంటారు. కొన్ని నెలలుగా ఈ రోడ్డు పూర్తిగా చెడిపోవడంతోపాటు అక్కడక్కడ గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తుంది. ఈ దారిగుండా ద్విచక్ర వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు అదుపుతప్పి పడిపోతున్నట్లు రెండు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. మండల ప్రజలకు ఏ అవసరమున్న నిత్యం జమ్మికుంటకు పోయి వస్తుంటారు. రోడ్డు అధ్వానంగా ఉన్న కారణంగా వాహనదారులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. గోదావరిఖని నుంచి జమ్మికుంటకు వెళ్లే బస్సులు కూడా రోడ్డు బాగాలేని కారణంగా బస్సు డ్రైవర్లు నానా యాతన పడుతున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు సింగల్ రోడ్డుతో పాటు రోడ్డంతా గుంతలు, బురదమయంగా మారింది. రహదారి పక్కన వ్యవసాయ భూములు ఉన్న పొలాలు దున్నే కేజ్ వీల్స్‌ను ట్రాక్టర్ డ్రైవర్లు రోడ్డుపై నేరుగా నడపడం వలన కూడా రోడ్డు చెడిపోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.


బురదమయంగా మారిన కిష్టంపేట-మిర్జంపేట రోడ్డు

మిర్జంపేట, కిష్టంపేట నుంచి మండలంలోని మల్యాల గ్రామ పరిధిలో ఉన్న ఆదర్శ పాఠశాలలో చదువుకోవడానికి ప్రతిరోజు బస్సుల్లోనే వస్తు పోతుంటారు. రోడ్డు సరిగా లేని కారణంగా పాఠశాలకు సమయానికి చేరలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంపై స్పందించి కిష్టంపేట నుంచి మిర్జంపేట ద్వారా ఓదెల మండలం గుంపుల వరకు డబుల్ రోడ్డు వేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దపల్లిటౌన్, జూలై 17: సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తు గడువును జూలై 31వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి ఎం.నాగలేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఇట్టి సదవకాశాన్ని ఉపయోగించుకొని స్టడీసర్కిల్‌సీజీజీ.గోవ్.ఇన్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని, తెలిపారు

పౌష్టికాహారంలో నాణ్యతలోపం

పెద్దపల్లి రూరల్, జూలై 17 : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంలో నాణ్యత లోపిస్తోంది. మండలంలోని గౌరెడ్డిపేట అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులు కొమిరె రమ్య మూడు రోజుల క్రితం కోడి గ్రుడ్లు తీసుకుంది. బుధవారం వాటిని ఉడకబెట్టగా కోడిగ్రుడ్లు కుళ్లిపోయి దుర్వాసన వచ్చాయి. దీనిపై అంగన్‌వాడీ టీచర్‌ను అడుగగా దురుసుగా సమాధానమిచ్చిందని రమ్య కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మత ప్రచారాన్ని అడ్డుకున్న బీజేపీ నాయకులు

- ఇరు వర్గాల వారికి ఏసీపీ కృష్ణ కౌన్సెలింగ్

ఓదెల, జూలై 17 : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అధికారుల అనుమతి లేకుండా క్రైస్తవ మత ప్రచారాలను నిర్వహిస్తున్న వారిని బీజేపీ, హిందూవాహిని, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. జమ్మికుంట వైపు నుంచి కొంత మంది క్రైస్తవులు పొత్కపల్లి చర్చిలో నిర్వహించనున్న కార్యానికి హాజరవుతున్న క్రమంలో గేయాలు అలపిస్తూ ప్రచారం చేస్తుండగా పొత్కపల్లిలో బీజేపీ నాయకులు అడ్డుకొని కరపత్రాలను చించివేశారు. అలాగే గూడెం, ఇందుర్తి, శానగొండలోనూ అడ్డుకొని బయటికి పంపించారు. పొత్కపల్లిలో ఎస్ఐ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఇరు వర్గాలను శాంతింపచేసిన కూడా ఉద్రిక్త పరిస్థితి అదుపులోకి రాలేదు. దీంతో పోలీసులు క్రైస్తవ ప్రచారకులు, పాస్టర్లను అదుపులోకి తీసుకున్నారు. సుల్తానాబాద్ సీఐలు సుబ్బారెడ్డి, కృష్ణ, ఎస్ఐలు అశోక్‌రెడ్డి, ఓంకార్, శ్రవణ్‌కుమార్ బందోబస్తు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కారెంగుల శ్రీనివాస్, శనిగరపు రమేష్, తీర్థాల కుమార్, పులి కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ కృష్ణ

సమాచార లోపం..

పొత్కపల్లిలోని చర్చికి క్రైస్తవులు వస్తున్న క్రమంలో ఇరు వర్గాల సమాచారం లోపం వల్ల క్రైస్తవులను అడ్డుకున్నారని ఏసీపీ గజ్జి కృష్ణ తెలిపారు. అనంతరం పాస్టర్లు, బీజేపీ నాయకులకు ఏసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇలాంటివి పునరావృతం అయితే చట్టరీత్యా చర్య తీసుకుంటామని హెచ్చరించి పంపించారు.

'ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'

పెద్దపల్లిటౌన్, జూలై17: ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిధిని విడుదల చేయాలని ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు రేవెల్లి తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఏకలవ్య జయంతి వేడుకలు తెలంగాణ ప్రజా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ట్రైబల్ కార్యాలయం ఏర్పాటుచేసి ఎరుకల సభ్యులకు రుణాలు అందించి ఆదుకోవాలని కోరారు. ఎరుకల జాతి అభ్యున్నతికి ఏకలవ్యుని బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మానుపాటి శ్రీనివాస్, ఏకలవ్య సేవా సమితి జిల్లా అధ్యక్షులు మానుపాటి రవి, దాసరి కిష్టయ్య, లోకిని మల్లేష్, రేవెల్లి శీనయ్య, మానుపాటి సంపత్, వెంకటేష్, సార్ల సాయిలు, మానుపాటి ఆంజనేయులు, వాల్మీకి సంఘం నాయకులు ట్యాంక్ జయదేవ్ పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాదిగ శక్తి సభ్యులు

పెద్దపల్లిటౌన్, జూలై 17: జిల్లా కేంద్రంలోని అమర్‌చంద్ కళ్యాణ మండపంలో ఈనెల 21న నిర్వహించనున్న మాదిగ శక్తి పార్లమెంట్ సదస్సును విజయవంతం చేయాలని మాదిగ శక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ సన్నీ పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో సదస్సు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా సన్నీ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచిన హక్కుల ద్వారా ప్రజలందరు ఆత్మగౌరవం, సమాన హక్కులతో, కుల, మత ప్రాంతీయ విభేదాలు లేకుండా సోదరభావంతో జీవించాలని తెలియజేశారు. మాదిగలు కోల్పోతున్న రాజకీయ వాటాను సాధించుకునేందుకు రాజకీయాలకు అతీతంగా ఒకేవేదిక మీదికి తెచ్చేందుకు మాదిగ శక్తిని ఏర్పాటు చేశామన్నారు. అందులో భాగంగానే గురు పౌర్ణమిని పురస్కరించుకుని పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మాదిగలకు సామాజిక న్యాయం అనే అంశంపై మాదిగ శక్తి సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కళ్ళేపల్లి రవి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నాగుల కిరణ్‌బాబు, పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు అంజయ్య పాల్గొన్నారు.

21 నుంచి నవోదయ పరీక్షకు ఉచిత శిక్షణ

కాల్వశ్రీరాంపూర్, జూలై 17: నవోదయ ప్రవేశ పరీక్ష కోసం ఉచిత శిక్షణను ఈనెల 21వ తేదీ నుంచి ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు రెండు గంటల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. పాఠశాలలోని 4, 5వ తరగతుల విద్యార్థులను క్లబ్‌చేసి నవోదయ శిక్షణనిస్తామన్నారు. ఊషన్నపల్లి ఇంగ్లీష్ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 4, 5వ తరగతులలో చేరిన విద్యార్థులకు మాత్రమే ఈ శిక్షణ ఉంటుందన్నారు.

వాహనాల తనిఖీ

పాలకుర్తి, జూలై 17: మండలం పరిధిలోని బసంత్‌నగర్ పోలీసులు బుధవారం కన్నాల టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆర్ స్వామి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుప వద్దని ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించాలన్నారు. ప్రయాణం చేసేటప్పుడు ప్రతి ఒక్కరు వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకూడదన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని ఎస్ఐ అన్నారు. ఈ తనిఖీల్లో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్ కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కళ్యాణ్‌నగర్, జూలై 17: ఆటోమోటార్ వర్కర్స్ యూనియన్ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆ యూనియన్ అధ్యక్షుడిజీ ఈదునూరి నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 21న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో జరిగే ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ 5వ మహాసభల వాల్‌పోస్టర్లను గాంధీనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని, ఈ చట్టం వల్ల డ్రైవర్లకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, మోటార్ రంగ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలతో మానసిక వేదనకు గురవుతున్నారని ఆయన అన్నారు. 21న జరిగే మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎడ్ల రవి కుమార్, ఆడెపు శ్రీనివాస్, సంతోష్, నవీన్, గంధం శ్రీనివాస్, తిరుపతి, కాంపెల్లి మల్లేషం పాల్గొన్నారు.

'మంత్రి శ్రీధర్‌బాబుపై ఆరోపణలు మానుకోవాలి'

కమాన్‌పూర్, జూలై 17: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్టమధు చౌకబారు ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉనికి చాటడానికే మంత్రిపై పుట్ట మధు ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. ఇప్పటికైనా అర్థరహిత విమర్శలు మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగు సత్యనారాయణ గౌడ్, నాయకులు గడప కృష్ణమూర్తి, పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి,నగునూరి నర్సయ్యగౌడ్, ఎండి ముస్తాక్, యూసుఫ్ లల్లూ, అనవేణి లక్ష్మీ రాజాం, మల్యాల మహేష్‌గౌడ్, చాట్ల గట్టయ్య, దేవునూరి చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

●ముత్తారం, జూలై 17: కమాన్‌పూర్ మాజీ జడ్పీటీసీ పుట్ట మధుకర్ మతిలేని మాటలతో మంథని ప్రజలను మభ్యపెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీలు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆటంకాలు కలిగించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని వారు విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంథనిలో అభివృద్ధి కోసం మంత్రి శ్రీధర్‌బాబు కష్టపడుతుంటే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. మరోసారి మంత్రిపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'మున్సిపల్ కార్యాలయాన్ని తరలించొద్దు'

మంథని, జూలై 17: ప్రజలకు అందుబాటులో ఉండి పాలనకు సౌకర్యార్థంగా ఉన్న మున్సిపల్ ఆఫీస్‌ను ప్రజానీకానికి దూరంగా ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేయడం సరికాదని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతరవేన క్రాంతికుమార్ అన్నారు. పోచమ్మవాడలో జరిగిన అభివృద్ధి పనుల కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయాన్ని తరలించడానికి యోచిస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించడం సరికాదన్నారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటు తర్వాత స్వల్ప కాలంలోనే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ చేసిన తర్వాత మాత్రమే మున్సిపల్ కార్యాలయ మార్పు జరగాలన్నారు.



ఓసీపీ-2 ప్రమాదం బాధాకరం..

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఆగస్టు 17: ఆర్‌జీ-3 పరిధిలోని ఓసీపీ-2లో మట్టికుప్పలు మీదపడి ఇద్దరు కార్మికులు మృతిచెందడం బాధాకరమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. పైప్‌లైన్ మరమ్మతులు చేస్తుండగా మట్టికుప్పలు మీద పడి ఫిట్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మజ్దూర్ విద్యాసాగర్ మృతిచెందడం బాధకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సింగరేణిపరంగా రావాల్సిన బెనిఫిట్స్‌ను కార్మిక కుటుంబాలకు త్వరగా అందజేయాలని సీఎండీ బలరాంనాయక్‌ను కోరారు.

సంస్థను కాపాడుకోవాలి : బీఎంఎస్

శ్రీరాంపూర్, జూలై 17: యూనియన్లకు అతీతంగా సింగరేణి సంస్థను కాపాడుకోవాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ కోరారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. మొదటిసారి గుర్తింపు సంఘంగా గెలిచిన యూనియన్ ఏఐటీయూసీ వల్లనే సింగరేణికి ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఆనాడు యాంత్రీకరణ, కాంట్రాక్టీకరణను ప్రోత్సహించి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. వారు చేసిన తప్పిదంతో లక్షకు పైగా ఉన్న పర్మినెంట్ కార్మికులు 39వేలకు తగ్గిపోయారని, బదులుగా కాంట్రాక్టు కార్మికులు పెరిగిపోయారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా భూగర్భ గనులు తీసుకొస్తామని హామీ ఇచ్చిన ఏఐటీయూసీ దానిని మరచిపోయిందని ఎద్దేవా చేశారు. ఈనేపథ్యంలో గనులతోపాటు ఎస్‌టీపీపీ కూడా ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో నడుస్తోందని తెలిపారు. అదే యూనియన్ ఇప్పుడు గుర్తింపు సంఘంగా ఉండడంతో సింగరేణి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

వర్షాలతో ఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూడాలి

- సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వరరెడ్డి - ఓసీపీ-2,3 ప్రాజెక్టుల సందర్శన


ఓసీపీ-3 ప్రాజెక్టును పరిశీలిస్తున్న డైరెక్టర్


ఓసీపీ-2 ప్రాజెక్టును పరిశీలిస్తున్న డైరెక్టర్

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 17: వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వరరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఓసీపీ-3 ప్రాజెక్టును ఆయన సందర్శించారు. పీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన వెంకటేశ్వరరెడ్డి ప్రాజెక్టు ఉత్పత్తి, ఉత్పాదకతలపై సమీక్షించారు. అనంతరం క్వారీని పరిశీలించారు. ప్రాజెక్టుకు కేటాయించిన రోజు వారి లక్ష్యాన్ని సాధించాలని, దానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. వర్షాలు ప్రారంభమైనందున క్వారీలో వరద నీరు చేరకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎప్పటి కప్పుడు రోడ్లు సరిచేసుకోవాలని సూచించారు. నిర్ణీత కాలంలో ఉత్పత్తి చేసిన బొగ్గు రవాణా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని ప్రాజెక్టు అధికారులకు డైరెక్టర్ సూచించారు.

డైరెక్టర్ వెంట ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, పీఓ మధుసూ దన్, మేనేజర్ రమేష్‌తో పాటు అధికారులు ఉన్నారు.

ఓసీపీ-2ను సందర్శించిన డైరెక్టర్

రామగిరి, జూలై 17: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2ను సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఓసీపీ-2 వ్యూపాయింట్ ద్వార క్వారీలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. రక్షణతో కూడిన నిర్దేశిత లక్ష్యాలనుసాధించేందుకు తీసుకుంటున్న భద్రత, ప్రణాళికలను డైరెక్టర్‌కు ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు వివరించారు. వర్షం కాలంలో క్వారీలో నీరు నిలవకుండా తీసుకుంటున్న జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శేఖర్‌బాబు, రాజేందర్, నాగరాజు, రామారావు, ఐలయ్య, రాజుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. కాగా డైరెక్టర్ వెళ్లిన కొన్ని గంటల్లోనే ఓసీపీ-2 క్వారీలో ఇద్దరు కార్మికులు బురద మట్టిలో సజీవ సమాధి కావడం కోసమెరుపు.